క్లుప్తంగా

వెంకన్న పవళింపు సేవ

మచిలీపట్నంటౌన్‌: బచ్చుపేట వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో స్వామివారి తిరు కల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారి పవళింపు సేవ కార్యక్రమం నిర్వహించారు. ఆలయ అర్చకులు ముత్తేవి వెంకటాచార్యులు నేతృత్వంలో పూజా కార్యక్రమాలు జరిగాయి. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త, చైర్మన్‌ ముత్తేవి రవికాంత్‌, కార్యనిర్వహణాధికారి ఎస్‌ ఎస్‌ చక్రధరరావు పర్యవేక్షించారు.

చలివేంద్రం ప్రారంభం



కోడూరు: వేసవిలో ప్రజల సౌకర్యార్థం స్థానిక తిరుపతి సత్యం సేవా సమితి ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. రామకృష్ణాపురం రహదారిలో ఏర్పాటు చేసిన ఈ చలివేంద్రాన్ని అవనిగడ్డ సీఐ జి.శ్రీనివాస్‌, ఎస్‌ఐ రాజేంద్రప్రసాద్‌ ప్రారంభించారు. ప్రతి ఏటా సత్యం సేవా సమితి ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్న సమితి చైర్మన్‌, టీఎ స్సార్‌ గ్రూప్‌ అధ్యక్షుడు తిరుపతి శ్రీనివాసరావును సీఐ ప్రత్యేకంగా అభినందించారు. తొలి రోజు చలివేంద్రం వద్ద మజ్జిగను పంపిణీ చేశారు.

వైభవంగా గ్రామ దేవతల జాతర



కృత్తివెన్ను: గ్రామ దేవతలు పల్లాలమ్మ, మారెమ్మల జాతర మహోత్సవం ఆదివారం యండపల్లి గ్రామంలో వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆలయం వద్ద అమ్మవార్లకు నైవేద్యాలను భక్తులు సమర్పించారు. అనంతరం యండపల్లి, గాంధీనగరం గ్రామాలలో భక్తులు కనకడప్పుల వాయిద్యాల నడుమ గ్రామోత్సవం నిర్వహించారు. ఇంటి ఆడపడుచులు, బంధువుల రాకతో రెండు గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొంది.

జూద శిబిరాలపై దాడులు

ఆరుగురి అరెస్ట్‌

పెడన: మండలంలోని కోడిపందెం, జూదం ఆడుతున్న వారిపై పెడన పోలీసులు ఆదివారం దాడులు చేశారు. ఆరుగురిని అరెస్ట్‌ చేశారు. పెడన ఎస్‌ఐ వి. రవిచంద్రకుమార్‌ తెలిపిన వివరాల ప్రకారం.. గాయంపాడు శివారులో కోడిపందేలు నిర్వహిస్తున్నట్లు అందిన సమాచారంతో దాడులు చేశారు. ఈ దాడిలో ముగ్గురిని అరెస్ట్‌ చేసి రూ.2,700 నగదు, రెండు కోడిపుంజులు, రెండు కోడికత్తులను స్వాధీనం చేసుకున్నారు. కొంకేపూడి గ్రామంలో పేకాడుతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకుని వీరి నుంచి రూ.1,470 నగదును స్వాధీనం చేసుకున్నారు.

పూర్వ విద్యార్థుల వితరణ



పెడన: బట్ట జ్ఞానకోటయ్య జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థిని విజయకుమారి బృందం పాఠశాలకు రూ.40 వేలు విలువ గల లాకర్లు కలిగిన బీరువాను ఆదివారం హెచ్‌ఎం జయలక్ష్మికి అందజేశారు. సిలింగ్‌కు అయ్యే ఖర్చును చండిక పూర్ణచంద్రరావు సోదరులు గంటల నాయుడు బృందం అందజేశారు. సీసీ కెమేరాలను పిచ్చిక సతీష్‌ బాబు (వార్డు కౌన్సిలర్‌) బృందంతో పాటు సహాయ ఫౌండేషన్‌ అధ్యక్షుడు ఉస్మాన్‌బాషా, శివార్జున స్టడీ సర్కిల్‌ అధినేత కాగిత సాంబశివరావు, కుట్టు మిషన్‌ టీచరు కూనపురెడ్డి లక్ష్మిలు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎంతో పాటు ఉపాధ్యాయులు కె. ఉమామహేశ్వరరావు, పూర్వ విద్యార్థి మట్టా రాధాకృష్ణమూర్తి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైద్య రంగానికి ప్రభుత్వం పెద్ద పీట

పెనమలూరు: రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగానికి పెద్ద పీట వేసిందని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. కానూరులో ఆదివారం కేపీ చారిటబుల్‌ సొసైటీ, మిత్రా మల్టీస్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే పార్థసారథి, కాపు కార్పొరేషన్‌ చైర్మన్‌ అడపా శేషు ప్రారంభించారు. ప్రభుత్వం విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యమిచ్చిందన్నారు. ప్రతి మండలానికి రెండు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు చేస్తొన్నారని తెలిపారు. ఫ్యామిలీ డాక్టర్‌ సేవలు కూడా ప్రవేశ పెట్టారని చెప్పారు. ప్రతి గ్రామంలో వైఎస్సార్‌ హెల్త్‌ క్లినిక్‌లు ఏర్పాటు చేశామని వివరించారు. ఆరోగ్యశ్రీ పథకాన్ని పూర్తిస్థాయిలో అమలు చేస్తున్నామని తెలిపారు. వైద్య శిబిరంలో 150 మందికి వైద్య సేవలు అందించారు. బీపీ, షుగర్‌, కీళ్లు, కండరాలు, చిన్నపిల్లల వైద్యంతో పాటు పలు వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు పిన్నబోయిన శ్రీనివాసరావు, తాళ్ల నరేంద్ర, ఈదా రాజేష్‌, వైఎస్సార్‌ సీపీ నేతలు అన్నే చిట్టిబాబు, అంగిరేకుల సీతారామయ్య, జొన్నలగడ్డ నరేష్‌, మండూరు కోటేశ్వరరావు, పోలవరపు మధు తదితరులు పాల్గొన్నారు.

ఊరూవాడా ‘జగనన్నే మా భవిష్యత్‌’

కోడూరు: ‘జగనన్నే మా భవిష్యత్‌.. మా నమ్మకం నువ్వే జగన్‌’ కార్యక్రమం ఊరూవాడా జోరుగా సాగుతోంది. మూడో రోజు ఆదివారం కోడూరు మండలంలోని 11 సచివాలయాల పరిధిలో ఈ కార్యక్రమాన్ని పండుగలా నిర్వహించారు. లింగారెడ్డివారిపాలెం శివారు నక్కవానిదారి గ్రామంలో జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకటసత్యనారాయణ, సచివాలయాల మండల కన్వీనర్‌ కడవకొల్లు శ్రీనివాసరావులు గృహ సారథులతో కలిసి ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. కుటుంబ సభ్యుల అనుమతితో ఇంటి గోడపై స్టిక్కర్‌ అతికించారు. కోడూరులో పార్టీ మండల కన్వీనర్‌ పరిశె మాధవరావు, విశ్వనాథపల్లిలో పార్టీ జిల్లా రైతు విభాగం కార్యదర్శి కొండవీటి వీరవెంకటనారాయణరావు పర్యవేక్షించారు. ప్రతి ఇంటి వద్ద మంచి ఆదరణ లభిస్తోందని, మళ్లీ వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డే ముఖ్యమంత్రి అని చెప్పారు. ఆయా కార్యక్రమాల్లో పీఏసీఎస్‌ చైర్‌పర్సన్లు చిట్టిప్రోలు బ్రహ్మారావు, కటకం కుటుంబరావు, ఎంపీటీసీలు బడే గంగాధరరావు, దాసరి వెంకటేశ్వరరావు, ఎస్సీ సెల్‌ నాయకులు వెన్నా ప్రసాద్‌ తదితరులు పాల్గొన్నారు.

విశేష స్పందన

చిరువోలు(మోపిదేవి): మండలంలోని పలు గ్రామాల్లో చేపట్టిన మా నమ్మకం నువ్వే జగనన్నకు విశేష స్పందన లభించింది. మెరకనపల్లి శివారు చిరువోలు గ్రామంలో ఆదివారం వైఎస్సార్‌ సీపీ నాయకులు ముత్యాల గోపాలరావు (గోపీ) ఆధ్వర్యంలో గ్రామ సచివాలయ కన్వీనర్‌ బాపట్ల కిషోర్‌, గ్రామ వలంటీర్‌, గృహ సారథులు ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు అందిన పథకాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో గ్రామ కన్వీనర్‌ గొరిపర్తి వేణుబాబు, గృహ సారథులు బొంతు రవి, కొచ్చర్ల నాగార్జున, నెరుసు ఆంజనేయులు, కర్రా బుజ్జిబాబు, గొరిపర్తి నాగశివ, పల్లపాటి జ్ఞానప్రకాశరావు, పల్లపాటి ప్రవీణ్‌, గురిందపల్లి సాంబశివరావు పాల్గొన్నారు.



బందరు 49వ డివిజన్‌లో పాల్గొన్న వైఎస్సార్‌ సీపీ శ్రేణులు



నక్కవానిదారి గ్రామంలో కరపత్రాలను అందిస్తున్న వైఎస్సార్‌ సీపీ శ్రేణులు



చిరువోలులో మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమంలో నాయకులు



పురిటిగడ్డలో మా నమ్మకం నువ్వే జగన్‌ నిర్వహిస్తున్న ద్వారకానాథ్‌

● **మచిలీపట్నంటౌన్‌:** జగనన్నే మా భవిష్యత్‌ కార్యక్రమం ఆదివారం మచిలీపట్నంలో గడప గడపలో ఉత్సాహంగా సాగింది. నగరంలోని అన్ని డివిజన్లలో వైఎస్సార్‌ సీపీ శ్రేణులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆయా డివిజన్ల కార్పొరేటర్ల నేతృత్వంలో వారు గృహాలకు వెళ్లిన సందర్భంలో ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోంది. గత టీడీపీ పాలకుల కంటే జగన్‌ పాలనే బాగుందంటూ ప్రజలు కితాబిచ్చారు. జగన్‌ లాంటి మనసున్న ముఖ్యమంత్రి ఉండబట్టే మా కష్టాలు తీరాయని ప్రజలకు నాయకులతో పేర్కొంటున్నారు. మళ్లీ జగన్‌నే ముఖ్యమంత్రిని చేస్తామని హామీ ఇచ్చారు. సీఎం జగన్‌ చిత్రంతో ఉన్న స్టిక్కరును ఇంటిపై అంటించేందుకు పార్టీ శ్రేణులు అనుమతి కోరుతున్న సమయంలో ఆ స్టిక్కరును గృహ యజమానులే తీసుకుని వారి గృహాలపై అంటించుకుంటున్నారు. నగరంలోని 49వ డివిజన్‌ నారాయణపురంలోని యానాదుల కాలనీలో ఆ కాలనీ వాసులు కార్పొరేటర్‌ పల్లి శేఖర్‌ వద్ద స్టిక్కర్లను తీసుకుని వారే అంటించుకున్నారు. ఇలా పలు డివిజన్లలో ఇలాంటి ఘటనలు చోటు చేసుకున్నాయి. కరపత్రాలను, వారికి అందిన సంక్షేమ పథకాలతో కూడిన వివరాల బుక్‌లెట్‌లను గృహ సారథులు ప్రజలకు అందజేశారు.

● **పురిటిగడ్డ(చల్లపల్లి):** మా నమ్మకం నువ్వే జగన్‌ కార్యక్రమానికి ప్రతి ఇంటా విశేష స్పందన లభిస్తోందని వైఎస్సార్‌ సీపీ సీనియర్‌ నాయకుడు, ఎంపీటీసీ మోపిదేవి ద్వారకానాథ్‌ అన్నారు. ఆదివారం పురిటిగడ్డలో మా నమ్మకం నువ్వే జగన్‌ కార్యక్రమం సందర్భంగా సర్పంచ్‌ మాతంగి రమ్య, మాజీ సర్పంచ్‌ పరుచూరి వెంకటేశ్వరరావు, మండల జేసీఎస్‌ కన్వీనర్‌ యడ్ల జగదీష్‌ ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల అమలు తీరు అడిగి తెలుసుకున్నారు. డోర్‌ స్టిక్కర్లు, ఫోన్‌ స్టిక్కర్లు అందచేశారు. చల్లపల్లి, పుచ్చగడ్డ, రామానగరం, కొత్తమాజేరు గ్రామాల్లో మా నమ్మకం నువ్వే జగన్‌ కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పీఏసీఎస్‌ చైర్మన్లు, నాయకులు, ఏఎంసీ డైరెక్టర్లు, గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

కొండలమ్మకు పూజలు



గుడ్లవల్లేరు: శ్రీ కొండలమ్మ అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులను చెల్లించుకునేందుకు ఆలయంలో ఆదివారం క్యూలైనుల్లో భక్తులు అధికసంఖ్యలో బారులు తీరారు. అమ్మవారికి మహిళా భక్తులు పాల పొంగళ్లను సమర్పించారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తులు తీర్థ ప్రసాదాల్ని స్వీకరించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఈఓ సురేష్‌, చైర్మన్‌ శేషం గోపి తగు ఏర్పాట్లు చేశారు.

ఘనంగా లక్ష్మీ గణపతి హోమం

గుడివాడటౌన్‌: స్థానిక మెయిన్‌రోడ్‌లోని శ్రీ విఘ్నేశ్వర స్వామి దేవస్థానంలో లక్ష్మీ గణపతి హోమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. పట్టణానికి చెందిన 72 మంది దంపతులు ఈ హోమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. పట్టణ ప్రజలు సుభిక్షంగా ఉండాలని, స్వామి వారి నిండు దీవెనలు ప్రజలపై ఉండాలని ఈ హోమం నిర్వహించినట్లు ఆలయ ఈఓ వీడీడీ ప్రసాద్‌ తెలిపారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తల మండలి సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి వేసవి శిక్షణ శిబిరాలు

కంకిపాడు: ఈడుపుగల్లు స్విమ్మింగ్‌పూల్‌లో సోమవారం నుంచి వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహించనున్నట్లు పూల్‌ కోచ్‌ నరేంద్ర తెలిపారు. సోమవారం నుంచి మే 1వ తేదీ వరకు మొదటి బ్యాచ్‌ జరుగుతుందన్నారు. మే 3 నుంచి 22వ తేదీ వరకు రెండో బ్యాచ్‌ నిర్వహిస్తామని చెప్పారు. మూడో వేసవి శిబిరం మే 24 నుంచి జూన్‌ 12వ తేదీ వరకు కొనసాగుతుందని తెలిపారు. 14 ఏళ్ల లోపు చిన్నారులకు రూ 1000, ఆపై వయస్సు వారికి రూ. 1500 చొప్పున ఫీజు నిర్ణయించామని, ఔత్సాహికులు ఈతలో శిక్షణ పొందాలని విజ్ఞప్తిచేశారు.

పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు
- దింటిమెరకలో గడప గడపకు మన ప్రభుత్వం

కోడూరు: పార్టీలకతీతంగా అర్హతే ప్రామాణికంగా ఇంటింటికీ సంక్షేమ పథకాలను వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అందిస్తోందని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. కోడూరు–3 సచివాలయం పరిధిలోని దింటిమెరక గ్రామంలో రమేష్‌బాబు ఆదివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని 206 ఇళ్లకు వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. ఆయా కుటుంబ సభ్యులు నాలుగేళ్లలో పొందిన లబ్ధిని వివరించి బుక్‌లెట్‌లను అందించారు. ఇన్ని మంచి కార్యక్రమాలు చేస్తున్న సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డితో పాటు తనను కూడా మరోసారి దీవించాలని రమేష్‌బాబు కోరారు.



సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి

ప్రతి కుటుంబానికి రూ.లక్ష నుంచి రూ.5 లక్షల వరకు లబ్ధి చేకూరిందని, మరో ఏడాది పాలనలో మరింత లబ్ధి చేకూరుతుందని వివరించారు.

సమస్యలు తెలుసుకుంటూ.. భరోసా ఇస్తూ..

గ్రామంలోని జగనన్న కాలనీలో రహదారులు, తాగునీటి సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు ఎమ్మెల్యేను కోరారు. తాగునీటి సమస్యను సత్వరమే పరిష్కరించి అవసరమైన ప్రాంతాల్లో చేతిపంపులను ఏర్పాటు చేయాలని స్థానిక పంచాయతీ అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రణాళిక రూపొందించామని, అన్ని సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. దివి వ్యవసాయ మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ కొక్కిలిగడ్డ వీరవెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకటసత్యనారాయణ, వైఎస్సార్‌ సీపీ మండల కన్వీనర్‌ పరిశె మాధవరావు, రైతు విభాగం జిల్లా కార్యదర్శి కొండవీటి వీర వెంకట నారాయణరావు, సచివాలయాల మండల కన్వీనర్‌ కడవకొల్లు శ్రీనివాసరావు, ఎంపీటీసీ బడే గంగాధరరావు, పార్టీ జిల్లా సంయుక్త కార్యదర్శి కోట పద్మావతి వరప్రసాద్‌ పాల్గొన్నారు.

జగన్‌తోనే మచిలీపట్నానికి మహర్దశ

- వచ్చే నెలలో పోర్టు పనులు ప్రారంభించనున్న సీఎం జగన్‌
- మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి

గుడ్లవల్లేరు: సీఎం వై.ఎస్‌.జగన్‌మోహన్‌రెడ్డి పనితీరుతోనే మచిలీపట్నానికి మహర్దశ పట్టనుందని మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి అన్నారు. ఆదివారం అంగలూరులో ఎంపీ బాలశౌరితో పాటు గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని) చేతుల మీదుగా రూ.32 లక్షల ఎంపీ నిధులతో ఎస్సీ కమ్యూనిటీ హాల్‌ నిర్మాణానికి భూమిపూజ చేశారు. తొలుత రూ.40 లక్షలతో నిర్మించిన సచివాలయం, జెడ్పీ నిధులు, పంచాయతీ సంయుక్తంగా రూ.16.60 లక్షలతో నిర్మించిన మైక్రో వాటర్‌ ఫిల్టర్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ బాలశౌరి మాట్లాడుతూ మచిలీపట్నం 1734లో ఏర్పడిందన్నారు. అలాంటి పట్టణానికి వందల కోట్లతో మెడికల్‌ కాలేజీని అందించిన ఘనత జగన్‌కే దక్కుతుందని తెలిపారు. జగన్‌ హామీ మేరకు బందరు పోర్టును నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. ఈ నిర్మాణానికి పవర్‌ ఫైనాన్స్‌ ద్వారా రూ.4 వేల కోట్లు కూడా మంజూరయ్యాయని తెలిపారు. ఇప్పటికే రూ.500 కోట్ల విడుదల అయినట్లు చెప్పారు. పోర్టు నిర్మాణంతో చుట్టుపక్కల ప్రాంతాల్లో ఉద్యోగ, వ్యాపార అవకాశాలు మెండుగా పెరిగి ఉపాధి అవకాశాలు యువకులకు ఏర్పడనున్నాయని తెలిపారు. ఎస్సీ వర్గానికి చెందిన ఒకొక్కరికీ సీజీసీఎం టీసీ స్కీమ్‌ కింద రూ.5 కోట్ల వరకూ పరిశ్రమలను నెలకొల్పేందుకు లోన్లను ఇచ్చే అవకాశం ఉందన్నారు. చదువుకున్న అన్ని వర్గాల పేద విద్యార్థులు విదేశీ చదువులకు వెళ్లేందుకు బ్యాంకు లోన్లు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ లోన్లను సంబంధించి ఎవరైనా తన ఎంపీ కార్యాలయాన్ని సంప్రదించవచ్చన్నారు. ఎమ్మెల్యే కొడాలి నాని కోరిక మేరకు కమ్యూనిటీ హాల్‌ నిర్మాణానికి మరొక రూ.25 లక్షలను మంజూరు చేస్తున్నట్లుగా ఎంపీ ప్రకటించారు. కొడాలి నాని మట్లాడుతూ జగన్‌ నాలుగేళ్ల పాలనలో సంక్షేమ, అభివృద్ధికి నిదర్శనమే గ్రామ సచివాలయ వ్యవస్థ అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌ సీపీ రాష్ట్ర కార్యదర్శి దుక్కిపాటి శశిభూషణ్‌, గుడివాడ ఎన్టీఆర్‌ స్టేడియం కమిటీ వైస్‌ చైర్మన్‌ పాలేటి చంటి, ఎంపీపీ కొడాలి సురేష్‌, తహసీల్దార్‌ అబ్దుల్‌ రెహ్మాన్‌ సుల్తానా, పీఏసీఎస్‌ అధ్యక్షుడు దుగ్గిరాల శేషుబాబు, సర్పంచులు మేడేపల్లి రవికుమార్‌, కాలిశెట్టి అర్జునరావు, వైఎస్సార్‌ సీపీ నాయకులు త్రిపురనేని ప్రసాద్‌, పెన్నేరు ప్రభాకర్‌, తాళ్లూరి మాధవ్‌, నిమ్మగడ్డ కుటుంబరావు తదితరులు పాల్గొన్నారు.



సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యే కొడాలి నాని

భక్తిశ్రద్ధలతో ఈస్టర్‌ వేడుకలు



కృత్తివెన్ను గుడిదిబ్బ మన్నా చర్చిలో ప్రార్థనలు చేస్తున్న విశ్వాసులు



పెడన ఆర్‌సీఎం చర్చిలో ప్రార్థనలు చేస్తున్న విశ్వాసులు

మచిలీపట్నంటౌన్‌: ఈస్టర్‌ పర్వదినాన్ని క్రైస్తవులు ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నగరంలోని చర్చిల్లో క్రైస్తవులు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చర్చిల వద్ద ప్రేమ విందు కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహించారు. వందలాది మంది క్రైస్తవులు ప్రేమ విందును స్వీకరించారు. నగరంలోని తెలుగు చర్చి, ఆర్‌సీఎం, మల్కాపట్నంలోని ఎల్‌ఈఎఫ్‌, రైలుపేటలోని బేతేలు ప్రార్థనా మందిరం, ఆనందపేట చర్చి, జిల్లా కోర్టు సెంటర్‌లోని బెరాకా మినిస్ట్రీస్‌ చర్చిలలో పెద్ద ఎత్తున ప్రేమవిందు నిర్వహించారు. ఈ సందర్భంగా ఈస్టర్‌ పర్వదినం విశిష్టతను ఆయా చర్చిల పాస్టర్లు వివరించారు.

● **కృత్తివెన్ను:** ఈస్టర్‌ పర్వదినాన్ని పురస్కరించుకుని మండల వ్యాప్తంగా ఆదివారం విశ్వాసులు భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు నిర్వహించారు. కృత్తివెన్ను గుడిదిబ్బలోని మన్నా చర్చి వద్ద పాస్టర్‌ ప్రభుదాస్‌ ఆధ్వర్యంలో తెల్లవారుజామున నాలుగు గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రత్యేక ప్రార్థనలు, అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఇమ్మానియేల్‌ చర్చి మినిస్ట్రీస్‌లో పాస్టర్‌ డానియల్‌రాజు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పెద్ద సంఖ్యలో విశ్వాసులు పాల్గొన్నారు.

● **పెడన:** ఈస్టర్‌ పర్వదినం క్రీస్తు పునరుత్థానం సమస్త మానవాళికి మహోదయమని ఆర్సీఎం చర్చి ఫాదర్‌ రెవరెండ్‌ కె. అనిల్‌ ఫ్రాన్సిస్‌ అన్నారు. ఆదివారం ఈస్టర్‌ పర్వదినాన్ని పురస్కరించుకుని స్థానిక తోటమూలలోని ఆర్సీఎం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఫాదర్‌ మాట్లాడుతూ ఈస్టర్‌ పర్వదినం ప్రాధాన్యతను వివరించారు.

● **అవనిగడ్డ:** దివిసీమలోని పలు ప్రాంతాల్లో ఈస్టర్‌ పర్వదినాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక కోటగిరిలంక ఆర్‌సీఎం చర్చిలో ఫాదర్‌ సురేష్‌ మెర్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఏసుక్రీస్తు సిలువ వేయబడి మూడోరోజున సజీవుడిగా లేచారని చెప్పారు. ఈ రోజునే క్రైస్తవులందరూ ఈస్టర్‌గా చేసుకుంటారన్నారు. పలు గ్రామాల నుంచి వచ్చిన సంఘస్తులు, పెద్దలు, ఉపదేశిలు పాల్గొన్నారు. స్థానిక సీబీసీఎన్‌సీ చర్చి, ఎల్‌ఈఎఫ్‌, పెంతొకోస్తు చర్చిల్లో ఈస్టర్‌ పర్వదినాన్ని ఘనంగా జరుపుకున్నారు.

ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి

కైకలూరు: ప్రజలు ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్‌), ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ అన్నారు. ఆటపాక మెయిన్‌రోడ్‌ కోదండ రామాలయం వద్ద శ్రీరామనవమి వేడుకలు ముగిసిన సందర్భంగా ఆదివారం జరిగిన భారీ అన్న సమారాధన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముందుగా కోదండ రామాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తుల అన్నసమారాధనలో వడ్డన చేశారు. ఎంపీపీ అడవి కృష్ణ, మండల వైఎస్సార్‌ సీపీ అధ్యక్షుడు భట్రాజు శివాజీ, నాయకులు రామిశెట్టి బుజ్జి, సింగంశెట్టి రాము, వేల్పూరి ఆదినారాయణ, మోహనరావు, కన్నా రమేష్‌, వడ్లాని సుబ్బారావు పాల్గొన్నారు.

క్రైస్తవుల సమస్యలు పరిష్కరిస్తాం

గుడివాడటౌన్‌ (నందివాడ): వైఎస్సార్‌ సీపీ క్రిస్టియన్‌ మైనారిటీ విభాగం నందివాడ మండల అధ్యక్షుడిగా ఎంపికైన మేడేపల్లి ఇమానుయేలును ఆదివారం కుదరవల్లి ఆర్‌సీఎం చర్చిలో క్రైస్తవ నాయకులు ఘనంగా సత్కరించారు. వైఎస్సార్‌ సీపీ క్రిస్టియన్‌ విభాగం ఏర్పాటు చేయడం, నందివాడ మండలానికి చెందిన ఇమ్మానుయేల్‌కు మండల అధ్యక్షుడిగా బాధ్యతలు ఇవ్వడం, సీఎం జగన్‌కు క్రైస్తవుల పట్ల ఉన్న ఆప్యాయతను తెలియజేస్తుందని నాయకులు అన్నారు. క్రైస్తవుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఇమ్మానుయేల్‌ ఈ సందర్భంగా తెలిపారు. క్రైస్తవ సంఘ నాయకులు గుజ్జుల చైతన్య జ్యోతి, చిన్న ఆశీర్వాదం, జి.సుధాకర్‌ బాబు, బి.శౌరియ్య పాల్గొన్నారు.

ఆస్పత్రి అభివృద్ధికి ఎన్ని నిధులైనా ఇస్తాం

గుడివాడటౌన్‌: గుడివాడ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి అభివృద్ధి విషయంలో నిధులు ఎంత కావాలన్నా తీసుకొచ్చే బాధ్యత తనదని బందరు పార్లమెంట్‌ సభ్యుడు వల్లభనేని బాలశౌరి అన్నారు. ఆదివారం స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో నూతనంగా నిర్మించిన వృద్ధుల వైద్య విభాగం భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి కూడా పేదల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారన్నారు. వృద్ధులకు ప్రత్యేక వైద్యం అవసరం అనగా రూ.50 లక్షలు నిధులు ఏర్పాటు చేసి తద్వారా వృద్ధులకు ప్రత్యేక వైద్య ఆస్పత్రి ఏర్పాటు చేసిన చరిత్ర ఆయనకే దక్కిందన్నారు. స్థానిక శాసనసభ్యులు కొడాలి శ్రీ వెంకటేశ్వర (నాని) ఆస్పత్రి అభివృద్ధి విషయం ప్రస్తావించగా సీఎస్‌ఆర్‌ నిధుల నుంచి పరికరాలను అందించామన్నారు. సీఎస్‌ఆర్‌ సమావేశం అనంతరం నియోజకవర్గానికి నిధుల అవరం ప్రస్తావించగా రూ.10 కోట్లు సేకరించడం జరిగిందన్నారు. వాటి ద్వారా కిడ్నీ, లివర్‌ తదితర వ్యాధులకు సంబంధించిన రక్త పరీక్షలకు కావలసిన అధునాతన పరికరాలను ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ఏర్పాటు చేశామన్నారు. గుడివాడ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి రూ 2.50 కోట్లు అందుకు నిధులు మంజూరు చేశామన్నారు. అనంతరం ఆస్పత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన రూ.35 లక్షల విలువ గల లిఫ్టును ఆయన ప్రారంభించారు. గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీ వెంకటేశ్వర (నాని) ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్‌ ఎం.వి.నారాయణరెడ్డి, ఆసుపత్రి సూపరింటెండెంట్‌ డాక్టర్‌ ఎస్‌.ఇంద్రాదేవి, వైఎస్సార్‌సీపీ నాయకులు మండల హనుమంతరావు, గొర్ల శ్రీను, నిర్మల, కాళీ, ఎన్టీఆర్‌ స్టేడియం వైస్‌ ప్రెసిడెంట్‌ పాలేటి శివసుబ్రహ్మణ్యేశ్వర చంటి తదితరులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న ఎంపీ బాలశౌరి

400 మందికి వైద్య పరీక్షలు

ముదినేపల్లి రూరల్‌: పెదపాలపర్రు శ్రీరామాలయ కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరంలో 400 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన మ్యాక్సీ విజన్‌ సూపర్‌ స్పెషాలిటీ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన చల్లగుళ్ల నాగమల్లేశ్వరరావు దంపతుల జ్ఞాపకార్థం శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో కంటి పరీక్షలతో పాటు పలురకాల వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన రిక్షాపుల్లర్‌ మృతి

కోనేరుసెంటర్‌: పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన రిక్షాపుల్లర్‌ ఆదివారం మృతిచెందాడు. మచిలీపట్నం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. మచిలీపట్నం ముస్తాఖాన్‌పేటకు చెందిన నావుడు శివనందికేశవరావు (50) రిక్షా నడుపుతూ జీవిస్తుంటాడు. గతంలో ఓ హత్యకేసులో ముద్దాయిగా జైలు శిక్ష అనుభవించి నాలుగు నెలల కిందట విడుదలై వచ్చాడు. అతనికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుమార్తెకు వివాహం కాగా కుమారుడు పనులు చేసుకుంటున్నాడు. జైలు నుంచి వచ్చిన శివనందికేశవరావు తన కుటుంబానికి ఏ విధమైన న్యాయం చేయలేకపోయానని బాధ పడుతూ ఉండేవాడు. ఈ నెల 5వ తేదీన మనస్థాపంతో పురుగుమందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. కుటుంబ సభ్యులు ఆయనను చికిత్స నిమిత్తం బందరు సర్వజన ఆస్పత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శివనందికేశవరావు ఆదివారం మృతిచెందాడు. భార్య సుబ్రహ్మణ్యేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

మహిళా వైద్య ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

కంకిపాడు (పెనమలూరు): మహిళా వైద్య ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఏపీ ఉమెన్‌ హెల్త్‌ ఎంప్లాయిస్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ రాష్ట్ర కార్యదర్శి వి.కె. ఎస్‌.జయలక్ష్మి కోరారు. కృష్ణా జిల్లా కంకిపాడులో అసోసియేషన్‌ సర్వసభ్య సమావేశం ఆదివారం జరిగింది. అసోసియేషన్‌ ఉపాధ్యక్షురాలు డి.కమలకుమారి, కోశాధికారి డి.వి.రత్నం, కృష్ణా జిల్లా కార్యదర్శి ఎం.సలోమి, ఉపాధ్యక్షురాలు కె.పద్మ, ఎన్టీఆర్‌ జిల్లా అధ్యక్షురాలు ఎం.నాగమణి పాల్గొన్నారు.

సుబ్బారాయుడి ఆలయం కిటకిట



మోపిదేవి: స్థానిక వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి దేవస్థానం భక్తులతో కిటకిటలాడింది. ఆదివారం కావడంతో తెలుగు రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. నాగపుట్ట, నాగమల్లి వృక్షం, పొంగళ్లశాల వద్ద భక్తులు గంటల తరబడి నిరీక్షించారు. స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ఏసీ ఎన్‌ఎస్‌ చక్రధరరావు ఆధ్వర్యంలో ఆలయ సూపరింటెండెంట్‌ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
మచిలీపట్నం డివిజన్‌
99122 20543, 79950 92116 (మచిలీపట్నం, పెడన)
99122 20545 (అవనిగడ్డ)
Office mail : sakshiads@gmail.com